క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.1.01 లక్షల విరాళం



దాత సత్యవతి కుటుంబానికి విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ దుర్గారావు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తురాలు ఆదివారం రూ. 1,01,116 విరాళంగా అందజేశారు. పెంటపాడు మండలం రామచంద్రాపురానికి చెందిన గోరు సత్యవతి ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబానికి ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

18 రౌండ్లలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ



జేసీ లావణ్యవేణి

పెదపాడు: పెదపాడు మండలంలోని వట్లూరులోని సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల కౌంటింగ్ కేంద్రం వద్దకు సిబ్బంది అంతా ఉదయం 6 గంటలకే తమ గుర్తింపు కార్డులతో చేరుకోవాలని దెందులూరు నియోజకవర్గ ఆర్వో, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. మంగళవారం ఉదయం 7 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభించబడుతుందని చెప్పారు. దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గం, దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని పార్లమెంట్ సెగ్మెంట్ పరిధికి సంబంధించి 239 ఈవీఎంలను లెక్కించడానికి 14 ప్లస్ 14 టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. లెక్కింపు ప్రక్రియ మొత్తం 18 రౌండ్లలో పూర్తవుతుందన్నారు. కౌంటింగ్ సిబ్బందికి రెండో పర్యాయం శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహిస్తామన్నారు. కౌంటింగ్ హాల్‌లోకి సెల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. సిబ్బంది ఎవరూ సెల్ ఫోన్లు కౌంటింగ్ కేంద్రానికి తీసుకురాకూడదన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి వసతి సదుపాయం కల్పిస్తామని చెప్పారు.

విజయోత్సవ ర్యాలీలకు అనుమతులు లేవు



పీ.శ్రీనివాసకుమార్, పెదవేగి సీఐ

దెందులూరు: ఈ నెల 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ అనంతరం ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో విజయోత్సవ ర్యాలీలకు, సభలకు, సమావేశాలకు ఎటువంటి అనుమతి లేదని పెదవేగి సీఐ పి. శ్రీనివాసకుమార్ అన్నారు. ఆదివారం దెందులూరు పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ సెక్షన్ 30, సెక్షన్ 144 అమలులో ఉన్నందున ఏ ప్రాంతంలోనైనా ఇద్దరు, ముగ్గురుకి మించి గుమ్మిగూడి ఉండరాదన్నారు. రౌడీషీటర్లు, పాత నేరస్తులపై పూర్తి స్థాయి నిఘా ఉందన్నారు. ఎన్నికల నిబంధనలు అనుసరించి అన్ని రాజకీయ పార్టీలు సోషల్ మీడియాలో వదంతులను ప్రచారం చేయడం, ఎదుటివారిని రెచ్చగొట్టేలా పోస్టింగులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ రోజున పోలింగ్‌కు ముందు హింసాత్మక సంఘటనలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు బైండోవర్లు చేసి రౌడీషీట్లు ఓపెన్ చేశామన్నారు. 4వ తేదీన కౌంటింగ్ రోజున ఎవరైనా హింసాత్మక ఘటనలకు పాల్పడితే వారిపై రౌడీషీట్లు ఓపెన్ చేసి వారి పేర్లు ఎన్నికల నేరస్తుల జాబితాలో చేర్చుతామని అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు వారి కార్యకర్తలు, అభిమానులను అదుపులో ఉంచుకోవాలని శాంతిభద్రతల పరిరక్షణను పోలీసులకు సహకరించాలని సీఐ శ్రీనివాసకుమార్ కోరారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న స్పెషల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్సై స్వామి

దెందులూరు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించి, ప్రజాజీవనానికి భంగం కలిగించే విధంగా రౌడీషీటర్లు ప్రవర్తిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పెషల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ అన్నారు. ఆదివారం దెందులూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ డి.మేరి ప్రశాంతి, నూజివీడు డీఎస్పీ లక్ష్మయ్య, పెదవేగి సీఐ పీ.శ్రీనివాసకుమార్ ఆదేశాలతో ఎస్సై కే.స్వామి రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. స్పెషల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రౌడీషీటర్లు వారి ఆలోచనా విధానాన్ని మార్చుకుని వారి కుటుంబం, అభివృద్ధి కోసం పని చేయాలన్నారు. రౌడీషీటర్లు వారి దైనందిత జీవన విధానంపై ఎస్సైను అడిగి తెలుసుకున్నారు. వివాదాలు, అల్లర్లు సృష్టించినా, సహకరించినా, జైలుకు వెళ్లడం ఖాయమని ఎస్సై స్వామి అన్నారు.

సీజనల్ వ్యాధులతో జర జాగ్రత్త

- రానున్న వానాకాలంలో పొంచి ఉన్న వ్యాధుల ముప్పు
- దోమల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టిన అధికారులు
- గ్రామాల్లో జరుగుతున్న మలాథియాన్ స్ప్రేయింగ్ పనులు
- పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత తప్పనిసరి అని సూచిస్తున్న అధికారులు



ఏజెన్సీలో మొదటి విడతలో జరుగుతున్న మలాథియాన్ స్ప్రేయింగ్ పనులు



మలేరియా జ్వరానికి కారణమయ్యే దోమ

బుట్టాయగూడెం: మరో వారం రోజుల్లో వర్షాకాలం రానుంది. రుతుపవనాలు కూడా ముందస్తుగానే రానుండడంతో వర్షాలు విస్తారంగా కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెప్తుంది. ఈ నేపథ్యంలో వాతావరణంలో మార్పులతో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, లేకుంటే పలు రోగాల బారిన పడే అవకాశం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా విస్తారంగా వర్షాలు కురిసిన సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అంటున్నారు. నీటి కలుషితం ద్వారా సీజనల్ వ్యాధులు ప్రబల్లే అవకాశం ఉందని, మురికినీటి నిల్వలతో దోమలు కూడా వృద్ధి చెందుతాయని వైద్యాధికారులు అంటున్నారు. వర్షాకాల సమయంలో గిరిజన ప్రాంతంలో ఎక్కువగా వాతావరణ మార్పుల వల్ల మలేరియా డెంగీ, టైఫాయిడ్, డయేరియా, కామెర్లు వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయని అధికారులు చెప్తున్నారు. ఏ చిన్న లక్షణం కనిపించినా వెంటనే అందుబాటులో ఉన్న ప్రభుత్వాస్పత్రులకు వెళ్లాలని వైద్యులను సంప్రదించి కచ్చితమైన చికిత్స పొందాలని సూచిస్తున్నారు.

ఏజెన్సీలో 136 మలేరియా సమస్యాత్మక గ్రామాలు

గిరిజన మండలాలైన పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల పరిధిలో సుమారు 136 మలేరియా వ్యాప్తి చెందే సమస్యాత్మక గ్రామాలుగా అధికారులు గుర్తించారు. అయితే గతంలో 172 సమస్యాత్మక గ్రామాలు ఉండగా దోమల నివారణకు మలేరియా అధికారులు చేపట్టిన చర్యలతో 39 గ్రామాల్లో మలేరియా వ్యాప్తి బాగా తగ్గిందని అధికారులు చెప్తున్నారు. మిగిలిన 136 గ్రామాల్లో మలేరియా నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఆయా గ్రామాల్లో ప్రస్తుతం మొదటి విడత మలేరియా స్ప్రేయింగ్ పనులు గత వారం రోజుల నుంచి ప్రారంభించారు. ఇందుకోసం 30 టన్నుల మలాథియాన్ స్ప్రేయింగ్ మందు డబ్బాలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. కాగా ఇప్పటివరకూ 32 గ్రామాల్లో మొదటి విడత పనులు పూర్తయినట్లు అధికారులు చెప్పారు.

టైఫాయిడ్ లక్షణాలు

కలుషిత నీటిని తాగడం వల్ల, బహిరంగ మలవిసర్జన వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. జ్వరం త్వరగా తగ్గకపోవడం, ఒంటి నొప్పులు, తల నొప్పి, కడుపులో అల్సర్‌లను వ్యాధి లక్షణాలుగా గుర్తించాలి. సురక్షిత నీటిని తాగడం, జ్వరం వచ్చిన వెంటనే రక్త పరీక్షలు చేయించుకుని వైద్యం పొందడం ద్వారా నయం కావచ్చు. వ్యక్తి గత మరుగుదొడ్లను వినియోగించుకోవడం మేలు.

డయేరియాతో జాగ్రత్త

కలుషిత నీరు తాగడం, కలుషిత ఆహారం తీసుకోవడం వల్ల డయేరియా వస్తుంది. ఒకరి నుంచి మరొకరికి త్వరగా వ్యాప్తి చెందుతుంది. నిరంతరంగా విరోచనాలు, వాంతులు కావడం ఈ వ్యాధి లక్షణాలు. డయేరియా నివారణకు వైద్యులు ఫ్లూయిడ్స్ ఎక్కిస్తారు. సురక్షిత, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పులుపు, కారం ఉండే ఆహారాన్ని తగ్గించడం, ఫాస్ట్ ఫుడ్ వంటివి తినకపోవడం ఉత్తమమని వైద్యులు సూచిస్తున్నారు.

వర్షాకాలంలో జాగ్రత్తలు తప్పనిసరి



వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. తగు జాగ్రత్తలు తీసుకోవాలి. కలుషిత నీటిని తాగడం వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఎక్కడడపడితే అక్కడ నీరు తాగకూడదు. అలాగే జ్వరం వస్తే అందుబాటులో ఉన్న ఆస్పత్రికి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకుని వ్యాధిని బట్టి వైద్యం పొందాలి. దోమతెరలు వాడటం మంచిది. గత ఏడాది ఇచ్చిన దోమతెరలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి.

– జె.సురేష్, ఇన్‌చార్జి జిల్లా మలేరియా అధికారి, కేఆర్‌పురం, బుట్టాయగూడెం మండలం

మొదటి విడత స్ప్రేయింగ్ పనులు



మలేరియా సమస్యాత్మక గ్రామాల్లో మొదటి విడత స్ప్రేయింగ్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఉన్నతాధికారులు పర్యవేక్షణలో పనులు చేయడం జరుగుతుంది. స్ప్రేయింగ్ పనులకు ప్రజలు పూర్తి సహకారం అందించాలి.

– పి.పెద్దిరాజు, సబ్ యూనిట్ ఆఫీసర్, బుట్టాయగూడెం

ముగిసిన షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం



విశేషాలంకరణలో షిర్డీ సాయినాథుడు

టి.నరసాపురం: బొర్రంపాలెం షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉదయం నుంచి ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. నిత్య హారతులతో పాటు, బాబాకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అలాగే సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించగా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

ఘనంగా మద్ది అంజన్న గ్రామోత్సవం



మద్ది ఆంజనేయస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



రథంలో కొలువైన స్వామివారు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామి వారి ఉత్సవ మూర్తులకు ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం ప్రత్యేక రథంలో స్వామివారిని ఉంచి గ్రామోత్సవం జరిపారు. గ్రామోత్సవంగా తమ ఇళ్ల ముంగిటకు వచ్చిన స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఈవో ఆకుల కొండలరావు, ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగరావు పాల్గొన్నారు.

నారసింహుని సేవలో...



నారసింహుని ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న ఏలూరు ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాధపురంలోని సుందరగిరిపై కొలువైన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి ఆలయాన్ని వైఎస్సార్ సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ ఆదివారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయన ముందుగా పలువురు పార్టీ నాయకులతో కలసి ప్రదక్షిణలు చేశారు. అనంతరం గర్భాలయంలో కొలువైన నారసింహుడిని, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు.

వైఎస్సార్ సీపీ విజయకేతనం ఖాయం



విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని పూజిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం: మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేస్తారని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఉన్న కనక దుర్గమ్మను ఆమె దర్శించుకున్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ మంగళవారం వచ్చే ఫలితాల్లో అమ్మవారి చల్లని దీవెనలతో వైఎస్సార్ సీపీ విజయకేతనం ఎగురవేసి, మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయాలని కోరుకుంటూ పూజలు నిర్వహించినట్లు తెలిపారు. సీఎంగా రెండోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదవి చేపడితే పేదల కుటుంబాలు బాగుపడతాయని ఆమె ఆకాంక్షించారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై దాడి..

దెందులూరు: రామారావుగూడెం పంచాయతీ మలకచర్లలో ఫీల్డ్ అసిస్టెంట్ కె.వెంకటరమణపై దాడి చేసిన ఉపాధి హామీ కార్మికుడు శ్రీను కూలి పనులు రెండు వారాల పాటు నిలుపుదల చేయాలని నిర్ణయం తీసుకున్నామని జాతీయ ఉపాధి హామీ పథకం దెందులూరు ఏపీఓ దశరధ రామ్‌జీ అన్నారు. ఆదివారం దెందులూరు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ శ్రీనును జరిగిన ఘటనపై వివరణ కోరగా స్పందించలేదని సోమవారం 10 గంటలలోపు కార్యాలయానికి రాకపోతే రెండు వారాల పాటు ఆయనకు పనులు నిలుపుదల చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేస్తామని ఏపీఓ అన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌పై దాడికి సంబంధించి దెందులూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందని ఆయన అన్నారు.

స్వచ్ఛందంగా రక్తదాన శిబిరం



శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని విద్యావికాస్ కిడ్స్ క్యాంప్ నందు ఆదివారం ఏలూరు రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. పట్టణంలోని అనేకమంది ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ శిబిరం ఏర్పాటు చేసిన పి.మంగ, కె.విజయలక్ష్మిలను రెడ్ క్రాస్ సంస్థ పీఆర్‌వో కొల్లి వెంకటరమణ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తలసేమియా వ్యాధితో బాధపడుతున్న తమ బిడ్డలతో పాటు ఎందరో చిన్నారులకు రక్తం అందించడానికి తమ వంతు సాయం అందించాలనే సంకల్పంతో స్వచ్ఛంద రక్తశిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వెంకటరమణ మాట్లాడుతూ జిల్లాలో బ్లడ్ నిల్వలు తక్కువగా ఉన్నాయని, ప్రజలు అపోహలు మాని స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి పట్టానికి చెందిన పీవీఎస్ ఫౌండేషన్ సంస్థ నుంచి సురేష్, పట్టణానికి చెందిన పి.కిషోర్, అశ్వారావుపేటకు చెందిన దేగల రాము, సహకారం అందించారు.

నేత్రపర్వం.. శ్రీవారి కల్యాణోత్సవం



మదనగోపాలస్వామి ఆలయంలో శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



మహిళలు పసుపు కొడుతున్న దృశ్యం

కొయ్యలగూడెం: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. టెంపుల్స్ సెంటర్‌లోని శ్రీరుక్మిణీ, సత్యభామ సమేత మదన గోపాల స్వామి ఆలయంలో ఉపాలయంలో కొలువై ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని అర్చకులు గుడిపూడి శేషాచార్యులు, బ్రహ్మశ్రీ పార్థసారథిల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాత సేవతో ప్రత్యేక పూజలు ప్రారంభం కాగా విశ్వక్సేన పూజ, విశేష అర్చన, బాల భోగ నివేదన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం నుంచి మాటూరు సుధీర్, నాగ వెంకట కాశీ అన్నపూర్ణ దంపతుల చేతులమీదుగా స్వామివారి కల్యాణం జరిపించగా పండితులు పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు స్వామివారి కల్యాణ విశిష్టత గురించి పండితులు అనుగ్రహ భాషణ చేసి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

వైఎస్సార్ సీపీ శ్రేణుల కృషి మరువలేనిది



కొండలరావుపాలెంలో అబ్బయ్యచౌదరిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు శాలువాలతో సత్కరిస్తున్న నాయకులు

పెదవేగి : ఇటీవల పూర్తయిన ఎన్నికల్లో ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త స్వచ్ఛందంగా పార్టీకోసం ఎంతో కృషి చేశారని, వాళ్లందరి సేవలు మరువలేనివని దెందులూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కొఠారు అబ్బయ్యచౌదరి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. పెదవేగి మండలం కొండలరావుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో అబ్బయ్యచౌదరిని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. దెందులూరు నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన వందలాది మంది నాయకులు కార్యకర్తలు ఆదివారం రాత్రి కొండలరావుపాలెంలోని కార్యాలయంలో అబ్బయ్యచౌదరిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో సత్కరించారు. గ్రామాల్లో పోలింగ్ సరళిని అబ్బయ్యచౌదరికి వివరించారు. ఈ సందర్భంగా అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ పార్టీ గెలుపు కోసం విశేష కృషి చేసిన ప్రతి ఒక్కరి సేవలను గుర్తు ఉంచుకుని వారికి అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. నియోజకవర్గంలోని ప్రతి కుటుంబానికి పార్టీలకు అతీతంగా సంక్షేమం, అభివృద్ధి అందించి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల పెద్దలు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దివ్యాంగులకు సేవలు ప్రశంసనీయం



దివ్యాంగులకు నిత్యావసరాలు, పండ్లు, పోషకాహారాన్ని అందిస్తున్న దాతలు, వైద్యులు

భీమడోలు: విఘ్నేశ్వర దివ్యాంగుల సేవా సమితి కేంద్రంగా దివ్యాంగులకు అందిస్తున్న సాయం ప్రశంసనీయమని పలువురు వక్తలు కొనియాడారు. గుండుగొలనులో ఆదివారం విఘ్నేశ్వర దివ్యాంగుల సేవా సమితి భవనంలో దాతల ఆర్థిక సాయంతో 55 మంది దివ్యాంగులకు నెలవారీ వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మామిళ్లపల్లి ఆదినారాయణ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు సన్న బియ్యం, మామిడి పండ్లు, పోషకాహారాన్ని అందించారు. అనంతరం ఏలూరుకు చెందిన లైఫ్ ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ హరికిషన్, డాక్టర్ గీతిక పాల్గొని ఆరోగ్య సంబంధమైన సూచనలు, సలహాలను అందించారు. వైద్యులను దాతలు ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో దాతలు ఎం.రామకృష్ణ, హనుమ, వంగపండు సతీష్, పెద్దలు పేరిచర్ల శ్యామలరాజు, కేశవరాజు, గేదెల శ్రీను, ఆరసంకల సోములు, రావి గంగరాజు, సభ్యులు పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామి ఆలయంలో అన్నదానం

పెదపాడు: పెదపాడులోని వీరాంజనేయస్వామి ఆలయంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో తమలపాకులతో, మల్లెలతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయంత్యుత్సవాల్లో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. అనంతరం పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థి కొయ్యాన తేజేష్‌కు ఆలయ కమిటీ తరుపున రెడ్డి సతీష్‌కుమార్ రూ. 5వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు తుమరాడ కనకారావు, అర్చకులు శ్రీనివాసాచార్యులు, ఆర్నిపల్లి రామకృష్ణ, జీ సింహాచలం పాల్గొన్నారు.

వేసవి తాపం నుంచి ఉపశమనం



గణపవరంలో మబ్బులు ఏర్పడి చల్లబడిన వాతావరణం

గణపవరం: రోహిణీ కార్తె ప్రభావంతో వారం రోజులుగా విపరీతమై ఎండ తీవ్రత, వడ గాల్పులతో అల్లాడిన ప్రజలకు ఆదివారం ఉపశమనం లభించింది. ఆదివారం ఉదయం నుంచి సూర్యుడు కనపడకుండా వాతావరణం పూర్తిగా మేఘావృత్తమై ఉంది. మూడు రోజులు గురు, శుక్ర, శని వారాల్లో ప్రజలు ప్రచండ సూర్యుడు ధాటికి వెలువడిన వేడి సెగలు తట్టుకోలేక ఉక్కిరిబిక్కిరి అయ్యారు. దీనికి తోడు కొల్లేరులో కిక్కిస గడ్డి తగలబెట్టడంతో తీర ప్రాంతాలైన గణపవరం, నిడమర్రు, ఉండి, ఆకివీడు, ఉంగుటూరు, భీమడోలు మండలాల ప్రజలు ఆపసోపాలు పడ్డారు. మధ్యాహ్నానికి గాలి పూర్తిగా స్తంభించి ఊపిరాడని పరిస్థితిని ఎదుర్కొన్నారు. మూడు రోజులూ ఫ్యాన్లు, ఏసీలు వదిలి బయటకు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ఉదయం 7 గంటలకు మొదలైన ఉక్కపోత, వేడి తీవ్రత రాత్రి 8 గంటల వరకూ కొనసాగి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. అలాంటి పరిస్థితికి పూర్తి భిన్నంగా ఆదివారం వాతావరణం పూర్తిగా చల్లబడి ప్రజలంతా వేసవితాపం నుంచి ఉపశమనం పొందారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ తరగతులు

భీమడోలు: భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరం శిక్షణ తరగతులు ఉత్సాహభరిత వాతావరణంగా సాగుతున్నాయి. ఆదివారం గ్రంథాలయాల్లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమాల్లో బాలబాలికలు పాల్గొని సామూహిక పుస్తక పఠనం చేసి పుస్తక సమీక్షలు రాశారు. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు టీవీ ఉమామహేశ్వరరావు, మండే సుధాకర్ చిన్నారులకు పలు అంశాలను నేర్పించారు. ఈనెల 7వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ శిక్షణ తరగతులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకులు కోరారు. తొలుత చిన్నారులచే ప్రతిజ్ఞ చేయించారు. చిన్నారులంతా యోగాసనాలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సత్యవతి మృతికి సంతాపం

దెందులూరు: రోడ్డు ప్రమాదంలో శనివారం రాత్రి మృతి చెందిన యర్రా సత్యవతి భౌతికకాయాన్ని శ్రీరామవరం గ్రామంలో ఆమె నివాసంలో వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన సహాయ సహకారాల అంశాన్ని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని చెప్పారు. వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అక్కినేని శ్రీనివాసరావు, నాయకులు ఉన్నారు.